# దేవయ్య ఇంటి నిర్మాణానికి ముగ్గు

- 'నమస్తే' కథనానికి స్పందన



దేవయ్య ఇంటి స్థలంలో నిర్మాణం కోసం పోసిన ముగ్గు

కొడిమ్యాల, ఏప్రిల్ 17: కొడిమ్యాల మండలం రామ్‌సాగర్ గ్రామానికి చెందిన ఆకునూరి దేవయ్య నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి అధికారులు ముగ్గు పోశారు. 'గూడు చెదిరింది.. కొట్టమే దిక్కయింది' శీర్షికన ఈ నెల 14న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం గ్రామ కార్యదర్శి విద్యాసాగర్, ఏఈ అసిస్టెంట్ రవి కలిసి దేవయ్య నూతన ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోశారు. వివరాల్లోకి వెళ్తే.. పైలెట్ గ్రామమైన రామ్‌సాగర్‌లో ఆకునూరి దేవయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, అధికారులు మంజూరు పత్రాన్ని అందజేశారు. దీంతో దేవయ్య తాను ఉంటున్న పాత ఇంటిని కూల్చివేసి.. కొత్త ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. టెక్నికల్ సమస్యతో మీ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, అప్పటివరకు ముగ్గు పోయలేమని అధికారులు చెప్పడంతో అవాక్కయ్యాడు. చేసేదేమీ లేక రెండు నెలలుగా కార్యాలయాల చుట్టూ తిరిగాడు. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. దేవయ్యతోపాటు ఉరుమడ్ల లక్ష్మి, ద్యాగల రాజమణి ఇల్లు నిర్మాణానికి అనుమతి వచ్చిందని పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ తెలిపారు.

# గులాబీ జెండాలతో కదలిరావాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, ఏప్రిల్17: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి ఇంటి నుంచి గులాబీ జెండాలతో కదలివచ్చి సక్సెస్ చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని ఎం పీఆర్ గార్డెన్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, అర్బన్ పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనను ప్రజలు మరోసారి కోరుకుంటున్నారని, మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. హుజూరాబాద్ గడ్డ చైతన్యానికి మారుపేరని, ఊరూరా అన్నివర్గాల ప్రజలు ప్రతి ఇంటి నుంచి కదలిరావాలని కోరారు. ఇక్కడ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గులాబీదండు కదంతొక్కాలి

- బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

అంతర్గాం, ఏప్రిల్ 17: బీఆర్‌ఎస్ 25 వసంతాల జాతరకు గులాబీదండు కదం తొక్కాలని, ఆ సభను చూసి కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. అధినేత కేసీఆర్ నాయకత్వంలో స్వరాష్ర్టాన్ని సాధించి నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేసి సగర్వంగా నిలిపింది గులాబీ జెండా అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి.. ప్రజలను కదిలించి ఉద్యమం చేయకుంటే తెలంగాణ వచ్చేది కాదన్నారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గురువారం అంతర్గాం, పాలకుర్తి మండలాల ముఖ్య నాయకులతో ముర్మూరు పంప్‌హౌస్ వద్ద ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన అట్టర్ ప్లాఫ్ అయ్యిందని, హైడ్రా పేరుతో పేద ప్రజల జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని, అధికారం కోల్పోయినా ప్రజల వెంటే ఉన్నదని చెప్పారు. కేసీఆర్, బీఆర్‌ఎస్సే ఈ రాష్ట్ర ప్రజలకు రక్షణ కవచమన్నారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే ఇంటి పార్టీ పండుగకు ప్రజలంతా స్వచ్ఛందంగా తరలిరావాలని, రామగుండం నియోజకవర్గంనుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటికొకరు గులాబీ జెండాతో బయలు దేరాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కోల సంతోష్‌గౌడ్, ఇంజపురి నవీన్, నాయకులు గోపు ఐలయ్య, నడిపెల్లి మురళీధర్‌రావు, కోల లత, బండారి ప్రవీణ్, మేరుగు పోశం, కొల్లూరి సతీశ్, అర్శనపల్లి శ్రీనివాస్, బాదె అంజలి, తుంగపిండి సతీశ్, రాములు, సందెల మల్లయ్య, కోల లత, కొలిపాక మధుకర్, ధరణి రాజేశ్, మహేశ్, ముద్దసాని సంధ్యారెడ్డి, సట్టు శ్రీనివాస్, మాదాసు సతీశ్, శశికుమార్ పాల్గొన్నారు.

# సభను సక్సెస్ చేద్దాం

- బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



కార్యకర్తలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ముస్తాబాద్, ఏప్రిల్ 17: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి విజయవంతం చేద్దామని ఆ పార్టీ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు స్వగృహంలో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓరుగల్లు సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేసి.. ప్రతి గ్రామం నుంచి సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఆర్‌బీఎస్ మాజీ మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, పార్టీ అధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు, సెస్ మాజీ డైరెక్టర్ విజయ రామారావు, కేసీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, సీనియర్ నాయకులు కొమ్ము బాలయ్య, యాది మల్లేశ్, యాదవ్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు నల్ల నర్సయ్య, గాండ్ల సుమతి, దమ్మ రవీందర్‌రెడ్డి, కాశోళ్ల పద్మ, దర్గాప్రసాద్, దేవయ్య, ఎల్లం, జ్యోతి సర్వర్‌పాషా, నాయకులు ఆనంద్‌రావు, చెవుల మల్లేశ్‌యాదవ్, భరత్ శీలం స్వామి, కట్ట బాబురావు, అల్లం లక్ష్మణ్, పోచయ్య, సంతోష్‌రావు, నరసింహారెడ్డి శ్రీనివాస్, కృష్ణ, కట్టబాపురావు పాల్గొన్నారు.

# వాల్ రైటింగ్ రాసి.. బైక్‌లపై ప్రచారం చేసి..

- రజతోత్సవ సభకు ప్రజలను ఆహ్వానించిన బీఆర్‌ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు



వేములవాడలో చలో వరంగల్ పోస్టర్‌ను కారుకు అతికిస్తున్న బీఆర్‌ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 17: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే సభకు పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. గోడలపై వాల్‌రైటింగ్ చేసి.. పట్టణంలో ద్విచక్ర వాహనాలపై తిరిగి సభకు రావాలంటూ అన్నివర్గాల ప్రజలను గురువారం ఆహ్వానించారు. అంతకు ముందు వేములవాడలో చలో వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరించి, వాహనాలకు అతికించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, పార్టీ పట్టణ కార్యదర్శి క్రాంతికుమార్, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మండలాధ్యక్షులు మల్యాల దేవయ్య, మ్యాకల ఎల్లయ్య, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నరాల శేఖర్, సిరిగిరి రామ్‌చందర్, నాయకులు రామతీర్థపు రాజు, నీలం శేఖర్, కొండ కనకయ్య, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మంతెన సంతోష్, ఈర్లపల్లి రాజు, గోపు పరశురాములు, కృపాల్, ఇస్మాయిల్, కమలాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పోతు అనిల్, ఫర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీలో సమ్మెకు సై

## మే 7న మొదటి బస్సుతో మొదలు

- 21 డిమాండ్లతో మూడు నెలల కింద నోటీస్
- స్పందించని యాజమాన్యం.. ప్రభుత్వం
- సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికులు

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధమవుతున్నారు. వచ్చే నెల 7 మొదటి బస్సు నుంచి సమ్మెకు దిగేందుకు రెడీ అయ్యారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని, యాజమాన్యం చెబుతున్న కల్పితాలను నమ్మి ఆర్టీసీపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నదని మండి పడుతున్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని తదితర 21 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీస్‌ను జనవరి 27 ఆర్టీసీ అధికారులకు సమర్పించామని, ఫిబ్రవరి 9 వరకు యాజమాన్యంగానీ, ప్రభుత్వంగానీ స్పందించాలని అందులో స్పష్టం చేశారు. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో ఇక సమ్మె తప్పదని స్పష్టం చేస్తున్నారు.

కరీంనగర్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్టీసీలో పోరుబాటకు రంగం సిద్ధమవుతున్నది. ఆర్టీసీ యాజమాన్య వైఖరిపై కార్మికులు, సమ్మె నోటీస్ ఇచ్చి మూడు నెలలు గడుస్తున్నా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెకు సన్నద్ధమవుతున్నది. 2023 సెప్టెంబర్ 15న బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రక్రియను కొనసాగించాలని, తదితర 21 డిమాండ్లతో జనవరి 27న ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఫిబ్రవరి 9వరకు ప్రభుత్వంగానీ, యాజమాన్యంగానీ స్పందించాలని, లేని పక్షంలో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని స్పష్టం చేశారు. కానీ, ఇప్పటి వరకు ఈ రెండు పక్షాల నుంచి చర్చలకు ఆహ్వానించకపోవడంపై మండిపడుతున్నారు. ఈ విషయాన్ని కార్మికులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇచ్చిన గడువు కూడా మీరడంతో సమ్మె అనివార్యంగా భావిస్తున్నారు. ఆర్టీసీలోని వివిధ సంఘాలతో ఏర్పడిన జేఏసీ నాయకులు ఈ మూడు నెలల కాలంలో అనేక రకాలుగా విజ్ఞప్తులు కూడా చేస్తూ వచ్చారు. గేట్ మీటింగ్‌లు ఏర్పాటు చేసి యాజమాన్యం తప్పుతోవ పట్టించాలని చూసినా ఒక్కతాటిపై నిలిచారు. జేఏసీ ఆధ్వర్యంలో కూడా కార్మికులను సన్నద్ధం చేసేందుకు సమావేశాలు, చర్చలు నిర్వహిస్తూ వచ్చారు. అలాగే మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో కూడా సమ్మెకు వెళ్లాలనే తీర్మానం తీశారు. ఇప్పటికే తీసుకున్న నిర్ణయం మేరకు వచ్చే నెల 7న మొదటి బస్సుతో సమ్మె మొదలవబోతున్నది.

### కాంగ్రెస్ మేనిఫెస్టో ఏమైనట్టు?

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఆ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించినా అవకాశం ఇవ్వలేదని జేఏసీ నాయకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే తాము సమ్మెకు దిగాల్సి వస్తున్నదని స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ చెప్పి ఏడాదిన్నర గడుస్తున్నా ఉలుకు పలుకు లేకపోవడంపై మండిపడుతున్నారు. నిజానికి ఈ ప్రక్రియ బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రారంభమైనప్పటికీ యాజమాన్యం ఇచ్చిన తప్పుడు సమాచారంతో ప్రభుత్వం తొక్కిపెట్టిందని ఆరోపిస్తున్నారు. వెంటనే విలీన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులపై పనిభారం తీవ్రంగా పడుతున్నదని, ఒక్కో డిపోలో 25 నుంచి 30 మంది డ్రైవర్లు, కండక్టర్ల లోటు ఉన్నదని, ఉన్నవారితోనే సేవలు నెట్టుకొస్తున్నారని, ఈ కారణంగా కార్మికులు రోజుకు 12 నుంచి 16 గంటలు పనిచేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీకి కోట్లలో లాభాలు వస్తున్నాయని ప్రకటనలు ఇస్తున్న యాజమాన్యం, రిటైర్‌మెంట్ ఉద్యోగుల సెటిల్‌మెంట్లు ఎందుకు చేయలేక పోతున్నదని ప్రశ్నిస్తున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల చివరి వేతనాలు కూడా ఇవ్వలేక పోతున్నారని, హెచ్‌ఆర్ తగ్గించడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెబుతున్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు ₹400 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఈ విషయంలో కూడా స్పష్టత లేదని జేఏసీ నాయకులు చెబుతున్నారు. 2021 నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ జరగ లేదని, మస్టర్ పే స్కేల్ విధానం వర్తింప జేయడం లేదని కార్మికులు వాపోతున్నారు. పదేళ్లుగా ఆర్టీసీలో నియామకాలు చేపట్టడం లేదని, ఈ పదేళ్లలో 16 వేల మంది రిటైర్డ్ అయినా ఉన్నవారితోనే విధులు నిర్వర్తిస్తున్నారని చెబుతున్నారు. కార్మికులకు రావాల్సిన ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించకపోవడంతో ఆర్థిక భారం పడుతున్నదని, అప్పుల పాలవుతున్నామని వాపోతున్నారు.

### ఎలక్ట్రికల్ బస్సులతో ప్రైవేటీకరణ?



ఆర్టీసీ యాజమాన్యం కొత్త ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశ పెట్టడంతో ప్రైవేటీకరణకు అడుగులు వేస్తున్నదని జేఏసీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఈ బస్సుల కొనుగోలులో ప్రభుత్వంగానీ, ఆర్టీసీ యాజమాన్యంగానీ ఒక్క పైసా పెట్టుబడి పెట్ట లే దని, ప్రైవేట్ సంస్థలైన జేబీఎం, ఒలెక్ట్రాల గుత్తాధిపత్యమే నడుస్తున్నదని కార్మికులు వాపోతున్నారు. ఈ బస్సుల్లో పనిచేస్తున్న డ్రైవర్లకు, ఆర్టీసీ సంబంధం లేదని, ఈ బస్సుల మీద ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ మొత్తం ప్రైవేట్ వ్యక్తులకే చెందుతున్నదని చెబుతున్నారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీనే తీసుకొని నడపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీని వల్ల తర్వాతి కాలంలో ఆ బస్సులు సంస్థకే చెందుతాయని భావిస్తున్నారు. ఎలక్ట్రికల్ బస్సులపై ప్రైవేట్ గుత్తాధిపత్యం ఉండొద్దని ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ బస్సుల ప్రవేశంతో తమకు ఉద్యోగ భద్రత కరువవుతుందని వాపోతున్నారు. ఎలక్ట్రికల్ బస్సులకు కిలో మీటర్‌కు ₹58 సంస్థ చెల్లించడం వల్ల కొన్ని రూట్లలో ఆర్టీసీ నష్టపోయే ముప్పు ఉన్నదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సమ్మె చేస్తేనే సంస్థ మనుగడ

ఆర్టీసీ యాజమాన్యానికి సమ్మె నోటీస్ ఇచ్చి మూడు నెలలు అవుతున్నది. ఇప్పటి వరకు స్పందించ లేదు. సమ్మె చేయాలనేది మా ఉద్దేశం కాదు. ఇతర ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న ప్రభుత్వం మా ఆర్టీసీపైన మాత్రం సవతి తల్లి ప్రేమ చూపుతున్నది. ఈ విధానం మారాలని కోరుకున్నాం. కానీ, మూడు నెలలుగా యాజమాన్యం చర్చలకు పిలువ లేదు. ప్రభుత్వం కూడా



చొరవ తీసుకోవడం లేదు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశ పెట్టిన తర్వాత ఆర్టీసీని పూర్తిగా ప్రైవేటీకరణ చేస్తారేమోననే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎలాంటి అగ్రిమెంట్లు లేకుండా ఈ బస్సులను ఆర్టీసీ సమకూర్చుకుంటున్నది. ఈ పని ఆర్టీసీ యాజమాన్యమే చేయాలని మేం డిమాండ్ చేస్తున్నాం. ప్రైవేట్ యాజమాన్యాలకు వీటిని అప్పగించి ఆర్టీసీ ఆస్తులకు కట్టబెడుతున్నారు. వీటి వల్ల కార్మికుల, భద్రతకు, ఆర్టీసీకి ముప్పువాటిల్లే ప్రమాదం ఉన్నది. అలాగే ఉద్యోగ నియామకాలు లేకుండా ఆర్టీసీలో ఉన్న కార్మికులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో కార్మికులపై పని భారం పెరుగుతున్నది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్ర ధాన హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చి పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మె ఒక్కటే మార్గమని భావిస్తున్నాం. సమ్మె చేయడం వల్లనే ఆర్టీసీ సంస్థకు మనుగడ ఉంటుందని భావిస్తున్నాం. వచ్చే నెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచి 7న మొదటి బస్సుతో సమ్మె ప్రారంభిస్తున్నాం. మంగళవారం హైదరాబాద్‌లో జేఏసీ మరోసారి సమావేశమైంది. ప్రతి కార్మికుడినీ సమ్మెలో పాల్గొనేలా చేయాలని నిర్ణయించింది. ఏ కార్మికుడిని కదిలించినా సమ్మెకు సిద్ధమనే చెబుతున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**- మారంరెడ్డి థామస్ రెడ్డి, టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ జేఏసీ వైస్ చైర్మన్**

### 21 డిమాండ్లు ఇవే..

- ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
- ఆర్థికపరమైన అంశాలను అమలు చేస్తూ, ప్రస్తుత సౌకర్యాలను కొనసాగిస్తూ, ప్రభుత్వంలో విలీనం చేయాలి
- 2021 వేతన సవరణ అమలు చేయాలి. ప్రభుత్వోద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలి.
- 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలి. రిటైర్డ్ ఉద్యోగులకు వేతన సవరణ అమలు చేయాలి.
- కొత్త బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీని అభివృద్ధి చేసి, ఆధునీకరించాలి.
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి, రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ఏటా బడ్జెట్‌లో 3 శాతం కేటాయించాలి.
- విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొని సంస్థకు ఇవ్వాలి.
- యాజమాన్యం వాడుకున్న సీసీఎస్, ఎస్‌ఆర్‌ఎస్, పీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలి. సీసీఎస్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఆఫీసు సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలి.
- మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్ కార్డు ఇవ్వాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. ఈ స్కీంలో జరుగుతున్న సీ, టీ కేసుల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.
- బ్రెడ్ విన్నర్, మెడికల్ ఇన్వాలిడేషన్ ఉద్యోగుల కుటుంబాలకు ఇచ్చే ఉద్యోగాలు రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. ప్రస్తుతం కన్సాలిడేటెడ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వ జీవో ఎంఎస్ నంబర్ 30, తేదీ 8 జూలై 2024 ప్రకారం వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచాలి. ఈ స్కీంలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ వంటి పోస్టులను కూడా ఇవ్వాలి.
- అన్ని కేటగిరిల్లో ఖాళీలను భర్తీ చేసి అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలి.
- ప్రతి కార్మికుడికి 21 రోజుల హాజరుతో ఇన్సెంటివ్ ఇవ్వాలి. బస్ బాడీ బిల్డింగ్‌తోపాటు మిగిలిన వర్క్‌షాపులను బలోపేతం చేయాలి. ప్రొడక్షన్ యూనిట్లలో 2013 నుంచి రావాల్సిన మ్యాన్ అవర్ రేటు అమలు చేయాలి.
- తార్నాక హాస్పిటల్‌లో అన్ని విభాగాల్లో సిబ్బందిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలి. రోగులు, వారి వెంట వస్తున్న అటెండెంట్లకు భోజనం, వసతి సౌకర్యం కల్పించాలి.
- ఉద్యోగులకు తార్నాక హాస్పిటల్లో మెరుగైన వైద్యం అందించాలి. ఉద్యోగి ఫ్యామిలీతో పాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వారి తల్లిదండ్రులకు కూడా వైద్య సౌకర్యం కల్పించాలి.
- సంస్థలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సరిపడా మందులు సరఫరా చేయాలి. వైద్య పరీక్షలకయ్యే ఖర్చు యాజమాన్యమే భరించాలి.
- రిటైరైన ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలి. రిటైర్ కాబోతున్న ఉద్యోగులకు అదే రోజు అన్ని సెటిల్‌మెంట్ల మొత్తాలను చెల్లించాలి.
- అకౌంట్స్ విభాగంలో సెంట్రలైజేషన్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలి.
- అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న రిటైర్డ్ అధికారులు, సూపర్‌వైజర్లను తీసివేసి వారి స్థానంలో ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలి. అవుట్‌సోర్సింగ్ ద్వారా కన్సల్టెన్సీల పేరు మీద జరుగుతున్న ఆర్థిక దుబారాను అరికట్టాలి.
- అన్ని యూనిట్లలో మహిళలతో పాటు పురుషులకు కూడా అన్ని వసతులతో పాటు తాగునీరు, వాహనాల పార్కింగ్‌కు సరిపడా షెడ్స్ నిర్మించాలి.
- పాత రెగ్యులేషన్స్ సమూలంగా మార్చి డ్రైవర్, కండక్టర్, మెయింటెనెన్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి.
- అక్రమ సస్పెన్షన్, రిమూవల్ అయినవారిని, అప్పీల్ రిజెక్ట్ అయినవారిని విధులలోకి తీసుకోవాలి.
- జూనియర్ అసిస్టెంట్ టెస్ట్ పాసైన వారికి పోస్టింగ్ ఇవ్వాలి. మిగిలిన ఖాళీలకు డిపార్టుమెంట్ టెస్టు నిర్వహించి భర్తీ చేయాలి.
- 2019వ సంవత్సరం సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీస్ కేసులను ఎత్తేయాలి.
- అద్దె బస్సు డ్రైవర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఈఎస్‌ఐ దవాఖానల్లో వైద్య సౌకర్యం కల్పించాలి. పీఎఫ్ కాంట్రిబ్యూషన్ రికవరీ చేయాలి.
- ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటల పనిదినాలు (సిటీ సర్వీసులలో 7 గంటలు) అమలు చేసి మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపు డ్యూటీలు పూర్తయ్యేలా డ్యూటీలు ఇవ్వాలి. ప్రతి కార్మికుడికి నెలకు 3 రోజులు సెలవులు మంజూరు చేయాలి.

# పెండింగ్ వేతనాలు ఇంకెప్పుడిస్తరు?

- చేసిన పనికి జీతం ఇవ్వమంటే బెదిరింపులా?
- కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖానలో కార్మికుల ధర్నా



దవాఖానలో ధర్నా చేస్తున్న కార్మికులు

కరీంనగర్ విద్యానగర్, ఏప్రిల్ 17: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించి దవాఖాన ఎదుట ధర్నా చేశారు. కార్మికులు అంటేనే అధికారులు, ప్రభుత్వానికి చిన్నచూపు అని మండిపడ్డారు. మూడు నెలలు జీతాలు ఇవ్వకుంటే కార్మికులు ఎలా బతకాలని ప్రశ్నించారు. చేసిన పనికి జీతం ఇవ్వాలని అడిగితే అధికారులు బెదిరిస్తున్నారని వాపోయారు. ఇతర కూలీలతో పని చేపిస్తామంటూ బెదిరిస్తున్నారని.. వారికి ఇచ్చే డబ్బేదో తమకు సకాలంలో ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. పెండింగ్ జీతాలు వచ్చేదాకా విధులు బహిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం వెంటనే మూడు నెలల పెండింగ్ వేతనాలతోపాటు ప్రతినెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ, కార్మికుల పెండింగ్ వేతనాల కోసం డీఎంఈ హైదరాబాద్ వారు రిలీజ్ చేసిన రూ.3కోట్లు చెక్ ఇంకా పెండింగ్‌లో ఉండడమేంటని ప్రశ్నించారు. పది శాతం కమీషన్ ఇస్తేనే రిలీజ్ చేస్తారా..? అని ప్రశ్నించారు. అట్లయితే కార్మికులందరం కలిసి బిచ్చమెత్తి ఇస్తామన్నారు. పెండింగ్ జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఇస్తేనే వారం క్రితం సమ్మె విరమించామని.. అయినా జీతాలు ఇవ్వడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, రెండు జతల బట్టలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పీ అరుణ్, టీ కళావతి, నాయకులు సుమన్, మహేశ్, మౌనిక, రాజయ్య, రజిత, అరుణ పాల్గొన్నారు.

# సభను జయప్రదం చేయండి

- బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి



తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 17: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో రజతోత్సవ సభ వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో నిర్వహిస్తున్న సభకు సిరిసిల్ల నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సభను విజయవంతం చేయడంలో భాగంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో పార్టీ శ్రేణుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసేందుకు పని చేస్తామన్నారు. సమావేశంలో టీపీడీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ మహిళా విభాగం పట్టణాధ్యక్షురాలు బత్తుల వనజ, నాయకులు బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, సత్తార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.